క్లుప్తంగా

దూసుకెళ్లిన ఇసుక ట్రాక్టర్



కంచెపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ నుంచి చిలకపాలెం వైపు ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్ ఆదివారం జాతీయ రహదారిపై కింతలిమిల్లు సమీపంలో డివైడర్‌పై ఉన్న ఇసుక కంచెలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో వెనుక నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఇసుక రీచ్‌ల నుంచి చిలకపాలెం సమీపంలో పోగులు వేసేందుకు వీటిని తరలిస్తున్నట్లు తెలిసింది.

జీవతత్వమే శివతత్వం



సూర్యనారాయణను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సకల జీవుల ఉనికికి మూలమై అన్నింటిని ప్రకాశింపజేసే తత్వమే శివతత్వమని దూసి సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'శివానందలహరి' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైతే తన ఉనికికి మూలమైన తత్వాన్ని తెలుసుకుంటారో వారే ఆత్మజ్ఞానం పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో గుమ్మా నగేష్, సీహెచ్.దుర్గారావు, దాసరి తవుడు, పెద్ది ఈశ్వరరావు, జంధ్యాల శరత్‌బాబు, మొదలవలస రమణ, లక్ష్మీ, సరస్వతి, ఎస్ఎస్ఎన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకొండకు సత్కారం



కోవెలకొండ సంతోష్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలస గ్రామానికి చెందిన కోవెలకొండ సంతోష్‌కుమార్‌ను ఆదివారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన 141 శతాధిక కవి సమ్మేళనం (గోదావరి కవనోత్సవం)లో ఘనంగా సన్మానించారు. ఆదికవినన్నయ్య యూనివర్సిటీ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంతోష్‌కుమార్ వీరఘట్టం మండలం చిదిమి పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ పాఠశాల తెలుగు భాషా పండిట్ కె.తిరుపతిరావు, తెలుగు ఉపాధ్యాయులు అభినందించారు.

దళిత మహాసభ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గమిదే

రణస్థలం: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రణస్థలం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి డి.రాము తెలిపారు. ఆదివారం జె.ఆర్.పురం హైస్కూల్ ఆవరణలో దళిత నాయకులు డి.కుసుమ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో సంఘ మండల అధ్యక్షుడిగా డి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.రాము, గౌరవ అధ్యక్షుడిగా కె.అప్పారావు, ట్రెజరర్‌గా కె.కుమార్, ఉపాధ్యక్షులుగా కె.రాజయ్య, సీతారాం, ఎస్.శివ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.తవుడు, బి.శ్రీను, కె.రాము, జాయింట్ సెక్రటరీగా ముక్కు చిన్న, ఎం.సంతోష్, బి.అర్జున, మహిళా ప్రతినిధులుగా టి.రమ, వై.తాడమ్మతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు.

ఆలయ స్థలాన్ని పరిరక్షించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

రణస్థలం: బంటుపల్లి రెవెన్యూ పరిధిలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి నిమిత్తం గ్రామపెద్దలు కేటాయించిన భూమిని అదే గ్రామానికి చెందిన తోలాపి వెంకటరమణ ఆక్రమించాడని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారుడి నుంచి స్థలాన్ని తీసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలిచేటి సురేష్‌కుమార్, వెలిచేటి సుధాకర్ కుమార్, సింహాచల రాయుడు, రాజశేఖర్, ముంగం రమణ, గోపిన కృష్ణారావు, పిసిని అసిరప్పడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెప్పేది ఉచితం.. చేసేది వ్యాపారం!

- ఉచితం ముసుగులో ఇసుక అక్రమ రవాణా
- మూడు రీచ్‌ల పరిధిలో 80 ట్రాక్టర్ల వినియోగం
- పట్టించుకోని అధికారులు



తమ్మినాయుడుపేటలో ఇసుక నిల్వలు



పొన్నాడలో ఇసుక పోగులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇసుక అక్రమ రవాణా మూడు లారీలు, ఆరు ట్రాక్టర్లుగా కొనసాగుతోంది. ఉచిత ఇసుక విధానం ముసుగులో దర్జాగా అక్రమ వ్యాపారం కొనసాగుతోంది. స్థానిక అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చన్న నిబంధనను అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఎచ్చెర్ల మండలంలో శ్రీకాకుళం నగరానికి సరిహద్దులుగా ఉన్న తమ్మినాయుడుపేట, పొన్నాడ, తెప్పరేవు గ్రామాల పరిధిలో అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. నాగావళి నది అనధికార రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తవ్వేస్తున్నారు. ఈ మూడు రీచ్‌ల పరిధిలో అక్రమ రవాణాలకు 80 వరకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు.

పక్క గ్రామాలకు నో పర్మిషన్..

నిబంధనల ప్రకారం సొంత అవసరాల కోసం ఇసుకను ఏ రీచ్ నుంచైనా తీసుకెళ్లవచ్చు. అయితే ఈ మూడు రీచ్‌ల వద్ద మాత్రం ఆ గ్రామాల వారికి తప్ప ఇతరులను రానివ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్క గ్రామాల వారు ఇసుక అవసరం కోసం వచ్చినా అక్రమార్కులు అడ్డుకుంటున్నారు. రీచ్‌ల సమీపంలోని తోటలు, ఖాళీ స్థలాల్లో రాత్రివేళ ట్రాక్టర్ల ద్వారా తరలించి పోగులు వేస్తున్నారు. వేకువజామున లారీలకు లోడ్ చేసి విశాఖపట్నం తరలిస్తున్నారు. ఇసుక పరిమాణం బట్టి రూ.30 వేలు నుంచి రూ.35 వేల మధ్య లారీ ఇసుకను అమ్ముతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళ నదిలో అక్రమంగా యంత్రాలు ఉపయోగించి ఇసుక తవ్వేస్తున్నారు. లోడింగ్‌కు సైతం యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు.

పొంచి ఉన్న ముప్పు..

తమ్మినాయుడుపేట, పొన్నాడ సమీపంలో నాగావళి నదిపై వంతెనలు ఉన్నాయి. మంచినీటి పథకాలు ఇన్‌ఫిల్టర్ బావులు ఉన్నాయి. ఇసుక తవ్వకాలతో ఆయా వంతెనలకు ముప్పు పొంచి ఉంది. తీర ప్రాంతంలో జిరాయితీ భూములు సైతం కోతకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టకపోతే రీచ్‌ల్లో భారీగా గోతులు ఏర్పడే అవకాశం ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం..



ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం వల్ల అర్హులకు న్యాయం జరగాలి. అలా కాకుండా నిబంధన పేరిట అక్రమ వ్యాపారం చేస్తే భవిష్యత్తులో అనేక పర్యావరణ సమస్యలు వస్తాయి. అనధికార, పర్యావరణ అనుమతులు లేని రీచ్‌లో తవ్వకం వల్ల ప్రమాదం పొంచి ఉంది.

– క్లోవెల్లి తిరుపతిరావు, తోటపాలెం మాజీ సర్పంచ్

పర్యావరణానికి నష్టం..



వంతెనలు, నీటి సరఫరా చేసే ఇన్‌ఫిల్టర్లు, కోత ఎక్కువగా ఉన్న రీచ్‌ల్లో అక్రమ ఇసుక వ్యాపారం వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుంది. భవిష్యత్తులో తీర ప్రాంత కోత ప్రధాన సమస్యగా మారుతుంది. అక్రమ ఆసుక రవాణాను అధికారులు అడ్డుకోవాలి.

– కొత్తకోట సూర్యారావు, కేశవరావుపేట

నిబంధనలు పాటించాలి..

ప్రభుత్వ నిబంధనల మేరకే ఇసుక తీసుకెళ్లాలి. ఉచిత ఇసుక విధానంలో అక్రమ తరలింపు, పోగులు వేయడం, తరలించటం నిబంధనలకు వ్యతిరేకం. క్షేత్రస్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటాం.

– ఎ.సింహాచలం, ఎచ్చెర్ల తహశీల్దార్

'మాస్టర్ ప్లాన్'కు ప్రజా స్పందన కరువు



సమావేశానికి హాజరైన ఇంజినీర్లు, సిబ్బంది

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం: ప్రజామోదం మేరకే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్‌పై ఆదివారం చర్చా వేదిక నిర్వహించారు. ప్రజలందరితో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన ఈ సమావేశానికి ప్రజలు అంతగా హాజరుకాలేదు. దీంతో తూతూ మాత్రంగానే సమావేశం ముగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు కొంత సమయం కావాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ప్రజల నుంచి వినతుల స్వీకరించి సూచనలు, సలహాలు పొందుపరిచి మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇంకా ఆలస్యం చేస్తే అమృత్ పథకం ద్వారా రావాల్సిన నిధులు వెనక్కి వెళ్లిపోతాయని చెప్పారు. మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయని తెలిపారు. ఇంజనీర్లకు, ప్రజలకు, నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే సర్క్యులేషన్ ప్యాట్రన్ అమలులోకి తీసుకొస్తామన్నారు. కొన్ని ప్రాంతాల్లో రెసిడెన్షియల్ ప్లాన్లు మాత్రమే ఇచ్చేందుకు అధికారాలు ఉన్నాయని, దీంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ప్రజల నుంచి 155 అభ్యంతరాలు అందాయని, వీలైనంత త్వరగా వీటిని పరిశీలించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్, ఎంఈ దక్షిణామూర్తి, టీపీఓ ఉమామహేశ్వరరావు, ఇంజినీర్లు హారికా ప్రసాద్, చక్రధర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తూర్పుకాపుల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాడ కైలాసరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో నిరుపేద తూర్పుకాపుల అభివృద్ధికి కృషి చేద్దామని తూర్పుకాపు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రాడ కైలాసరావు, ఎం.జోగినాయుడు, పి.తమ్మినాయుడు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో ఓ ప్రయివేటు కార్యాలయంలో తూర్పుకాపు ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పుకాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో త్వరలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులను సత్కరిస్తామన్నారు. తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు వివిధ శాఖల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులంతా సంఘంలో చేరాలని కోరారు. సమావేశంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కిల్లారి నారాయణరావు, మజ్జి రామారావు, వాళ్ల శ్రీరాములునాయుడు, కరణం చిన్న వెంకటరమణ, అంకడాల తవిటన్న, శాసపు జోగినాయుడు, ప్రధానోపాధ్యాయులు సత్యానారాయణ, చింతపల్లి జనార్ధనరావు, మహిళా ప్రతినిధి ఎస్.పార్వతి, పతివాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథాలయానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పుష్కరిణిలో స్నానాలాచరించారు. రెండు వైపులా క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం కూర్మనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పర్యాటక భవనంలో నాలుగు వందల మందికి అన్నదానం జరిగింది. ఆలయ ఈవో జి.గురునాథం, నర్సుబాబులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

అరసవల్లిలో కార్తీక సందడి



ఇంద్రపుష్కరిణి వద్ద మహిళల పూజలు

అరసవల్లి: పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. కార్తీక రెండో ఆదివారం సందర్భంగా వేకువజాము 4 గంటల నుంచే పవిత్ర ఇంద్రపుష్కరిణిలో స్నానాలు చేసి కార్తీక దీపాలను, తెప్పలను విడిచిపెట్టారు. సూర్యునికి అర్ఘ్యం సమర్పించి, ప్రసాదాలను నివేదించారు. అనంతరం స్వామి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు తలెత్తకుండా ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగేలా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తగిన చర్యలు చేపట్టారు. భారీగా భక్తులు తరలిరావడంతో ఒక్క రోజులో రూ.8,59,802 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు.

వివిధ దర్శనాల టికెట్ల రూపంలో రూ.4,71,800, విరాళాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.1,08,002, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.80 లక్షల వరకు ఆదాయం లభించిందని వివరించారు.

జ్యోతిర్మయి సత్సంగం నేడు

గార: మండలంలోని జొన్నలపాడు జంక్షన్ సమీపంలో శ్రీబృందావనంలో కార్తీక దశమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థాన గాయని, ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి సత్సంగం జరుగుతుందని నిర్వాహకులు చౌదరి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రవచనంతో ప్రారంభమై అనంతరం ప్రత్యేక భజన ఉంటుందని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

16 నుంచి ఆరాట్టు బ్రహ్మోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 16 నుంచి 25 వరకు పది రోజుల పాటు అయ్యప్ప స్వామి ఆరాట్టు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. కలశపూజలతో ప్రారంభమై స్వామివారికి అభిషేకాలు జరుగుతాయని, ముగింపు నాడు మేళతాళాలు, బాణసంచాతో నాగావళి నది వద్ద మణికర్ణిక ఘాట్ వద్ద స్వామికి సహస్ర కలశాభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

అలరించిన శివలీల హరికథ



భాగవతారిణి భారతిని సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మ్యూజిక్ డ్యాన్సు అకాడమీ, మావుడూరు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న హరికథ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఏలూరుకు చెందిన హరికథా భాగవతారిణి, జాతీయ బంగారు నంది అవార్డు గ్రహీత సప్పా భారతి 'శివలీల' హరికథ చక్కగా గానం చేశారు. సూర్యప్రసాదరావు, సత్యనారాయణశర్మలు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో పులఖండం శ్రీనివాసరావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, డాక్టర్ పి.మాలతి, మావుడూరు శ్రీనివాసరావు, ఇప్పిలి శంకరశర్మ, మావుడూరు సత్యనారాయణ, మండా శ్రీనివాసరావు, సోమకుమారి, మార్గదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

13న అయ్యప్ప తెప్పోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: బలగ ధర్మశాస్తా ఆలయంలో ఈ నెల 13న కార్తీక ద్వాదశి సందర్భంగా అయ్యప్పస్వామి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దేవరకొండ శంకరనారాయణశర్మ, కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. దీపారాధనలు కూడా జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా సత్యసాయి భజనలు



పెద్దమందిరంలో భజనలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయిబాబా జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న గ్లోబల్ భజనలలో భాగంగా జిల్లా కేంద్రంలోని 14 బాబా మందిరాలలో భజన కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై భజన చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, గంగుల రమణబాబు, కిల్లాన ఫల్గుణరావు, మందిరం కన్వీనర్లు, భక్తులు పాల్గొన్నారు.

బావి.. పారిశుద్ధ్య పనులేవీ?



ముషినివలస గ్రామంలోని బావి వద్ద పారిశుద్ధ్యం లోపించింది. చుట్టూ మురుగునీరు పేరుకుపోయి దోమలు, ఈగలకు నిలయంగా మారింది. నీరు సైతం కలుషితంగా మారుతోంది. వాడుక నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. అధికారులకు ఎన్నిసార్లు చెబుతున్నా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

– జి.సిగడాం

గేటు రూటే వేరు!



శ్రీకాకుళం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెనుక గేటు కొన్ని రోజులుగా మూలకు చేరిపోయింది. దీంతో ఆకతాయిలు రాత్రివేళ దర్జాగా కార్యాలయం వద్దకు వచ్చి మందు పార్టీలు చేసుకుంటున్నారు. దీన్ని ఇలాగే వదిలేస్తే కార్యాలయంలో విలువైన పత్రాలు, కంప్యూటర్ ఫర్నిచర్‌కు ప్రమాదం పొంచి ఉంది.

– శ్రీకాకుళం రూరల్

'బోరు'మంటోంది!



ఫరీదుపేటలోని బీసీ కాలనీలో తాగునీటి బోరు నిరుపయోగంగా మారింది. హెడ్‌కు తుప్పుపట్టి రంధ్రం ఏర్పడటంతో వినియోగంలో లేకుండా పోయింది. నెలల తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ప్రొటోకాల్‌కు తూట్లు పొడుస్తారా?

- అధికారులను నిలదీసిన జెడ్పీటీసీ, ఎంపీపీలు
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ప్రొటోకాల్‌కు సంబంధించిన వివాదంతో సమావేశం వాడీవేడిగా సాగింది. ఇటీవల బలివాడలో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో ఆహ్వానితులుగా జెడ్పీటీసీ, ఎంపీపీ పేర్లు లేకపోవడంపై సమావేశంలో లేవనెత్తారు. ఫ్లెక్సీలు మాదిరిగా శిలాఫలకాలపై నచ్చిన పేర్లు, వైఫ్ ఆఫ్‌లు, కేరాఫ్‌లు ఎలా నమోదు చేస్తారని ఎంపీపీ అంబటి నిర్మల, జెడ్పీటీసీ రుప్పదివ్య అధికారులను ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే గొండు శంకర్ కలుగుజేసుకొని ఈ విషయం తనకు నిజంగా తెలియదన్నారు. ఇందుకు కారణమైన ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందిపై మండిపడ్డారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రొటోకాల్ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈసారి ఎక్కడ ప్రారంభోత్సవం జరిగినా, శిలాఫలాకాలు పెట్టినా ప్రొటోకాల్ ప్రకారం సరిచూసుకోవాల్సిన బాధ్యత ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయ అధికారులపై ఉందన్నారు. ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ స్పందించి సిబ్బంది అలసత్వం కారణంగా తప్పు జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇసుక అందుబాటులోకి వచ్చినందున వచ్చే ఏడాది మార్చిలోపు జగనన్న కాలనీ పనులు పూర్తి చేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి రోడ్లు, డ్రైనేజీలు డిసెంబర్‌లోగా నిర్మించాలన్నారు. ఈ నెల 17 నుంచి ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పూర్తి స్థాయిలో ప్రారంభమవుతుందన్నారు. రైతులు తడి ధాన్యం, పొడిధాన్యం వేర్వేరుగా చేయాలన్నారు. లోవోల్టేజీ సమస్యలు ఉన్న చోట వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భగవంతుడిని ధ్యానించాలి



భజన చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నిత్య ఉపాసనతో భగవంతుడిని పూజించి తరించాలని ఇస్కాన్ జగన్నాథ్ మందిరం ప్రతినిధి లక్ష్మీపతి గౌర్‌దాస్ అన్నారు. పొన్నాడ బ్రిడ్జి సమీపంలోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవబంధాలను నుంచి విముక్తి పొందాలంటే భగవంతుడి ధ్యానం ఒక్కటే మార్గమని చెప్పారు. అనంతరం హరేరామ భజన, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళార్చన



అలంకరణలో కోదండరాముడు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ లక్కుడిపేటలోని కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసీదళార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్తీక శుద్ధ నవమి సందర్భంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పిక్నిక్ సందడి



మొగదాలపాడు తీరంలో గస్తీ కాస్తున్న మెరైన్ పోలీసులు

గార: కార్తీక ఆదివారం సందర్భంగా మొగదాలపాడు, కె.మత్స్యలేశం, శ్రీకూర్మం- మత్స్యలేశం బీచ్‌లో ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు సందడి చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సమీప జీడితోటల్లో భోజనాలు చేశారు. సాయంత్రం సముద్రంలో స్నానాలు చేస్తూ సందడిగా గడిపారు. శాలిహుండం బౌద్ధారామాలను పలువురు సందర్శించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు బాలకృష్ణ, మహాలక్ష్మీ, సిబ్బంది గస్తీ కాశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: కార్తీకమాస రెండో ఆదివారం సందర్భంగా వన భోజనాల సందడి నెలకొంది. ఎచ్చెర్ల మండలంలోని డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం బీచ్‌లు, పొన్నాడ నదీతీరం, దుప్పలవలస, ఎస్ఎస్ఆర్‌పురం తోటల్లో కుటుంబాలు సందడి చేశాయి.



తోటల్లో వన భోజనాలు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం: 9951602849, 9951602845
9912220367, 9705444191, 9010299083
Office mail : sklmadvt@gmail.com